
జెండా ఆవిష్కరించి వందన చేస్తున్న మంత్రి రవికుమార్


ప్రసంగిస్తున్న మంత్రి రవికుమార్


జెండా ప్రదర్శన



మొదటి బహుమతి పొందిన విద్యుత్‌శాఖ శకటం


పంచాయతీ రాజ్ శాఖ శకటం


హాజరైన అధికారులు, ప్రజలు

అగ్రస్థానం దిశగా.. అభివృద్ధి

- పర్యాటక రంగంపై ప్రత్యేకంగా దృష్టి
- రూ.490 కోట్లతో నిజాంపట్నం హార్బర్ విస్తరణ
- 79వ స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి గొట్టిపాటి సందేశం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉంచే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్లలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ జిల్లా స్థాయి వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు, ఎన్‌సీసీ, స్కౌట్స్ క్యాడెట్ల నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని ఇచ్చారు. జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసే దిశగా ఇప్పటికే కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. దాదాపు రూ.92 కోట్లతో సూర్యలంక బీచ్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయన్నారు. భవిష్యత్తులో పర్యాటకానికి గమ్యస్థానంగా జిల్లాలోని తీర ప్రాంతం నిలవనున్నదన్నారు. రూ.490 కోట్లతో నిజాంపట్నం హార్బర్ విస్తరణ పనులను చేపడుతున్నామన్నారు. బర్లీ పొగాకు రైతులను ఆదుకోవడానికి 34 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ సేకరిస్తుందన్నారు. ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే గుండ్లకమ్మ ప్రాజెక్టుపై దృష్టి పెట్టామన్నారు. గేట్లు బిగించడంతో పాటు రైతులకు సాగునీరు అందిస్తున్నామని గుర్తు చేశారు. మొట్టమొదటిసారిగా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని విడుదల చేసి రెన్యూబల్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.


విద్యార్థుల నృత్యాలు

రూ.182 కోట్లతో సమీకృత ఆక్వా పార్కు

వ్యవసాయం తర్వాత జిల్లాలో అత్యధికంగా సాగవుతున్న ఆక్వాపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టిందన్నారు. ఆక్వా రైతులకు సబ్సిడీ కింద యూనిట్ విద్యుత్ రూ.1.50లకే ఇస్తున్నామన్నారు. రూ.182 కోట్లతో (మిగతా 7వ పేజీలో)



జిల్లా చరిత్రను తెలిపేలా గీతం

బాపట్ల జిల్లా చరిత్ర, వైభవాన్ని తెలియజేసేలా రూపకల్పన చేసిన బాపట్ల జిల్లా గీతం సీడీని మంత్రి గొట్టిపాటి ఆవిష్కరించారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల, వీఆర్ క్రియేషన్స్ ఈ పాటను రూపొందించినట్లు కలెక్టర్ వెంకటమురళి మంత్రికి తెలిపారు. జిల్లా ప్రగతిని చాటేలా వివిధ విభాగాల శకటాల ప్రదర్శన సాగింది. రకరకాల ఆకృతులతో ప్రదర్శించిన శకటాలు ఆహూతు లను విశేషంగా ఆకట్టుకున్నాయి. 13 విభాగాలు శకటాల ప్రదర్శన చేపట్టగా మొదటి బహుమతి విద్యుత్‌శాఖ శకటం దక్కించుకుంది. రెండో బహుమతిని వ్యవసాయ, ఉద్యాన శాఖలు సంయుక్తంగా, మూడో బహుమతి మత్స్య శాఖ, పశుసంవర్థకశాఖ విభాగాలు సంయుక్తంగా దక్కించుకున్నాయి. పది విభాగాలు తమ ఉత్పత్తులతో స్టాళ్లను ఏర్పాటు చేయగా వ్యవసాయశాఖ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖలు మొదటి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు దక్కించుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సన్మానించిన మంత్రి వారి త్యాగాలను గుర్తు చేశారు. దేశభక్తి గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు విశేషంగా అలరించాయి. బాపట్ల మహిళా కళాశాల ప్రాంగణమంతా త్రివర్ణ పతాకాలు, ప్రేక్షకులతో నిండిపోయింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందితో పాటు వివిధ కేటగిరీల కింద ప్రశంసా పత్రాలను మంత్రి అందించారు.




వెద సాగు ప్రచారం


బాపట్ల జిల్లా గీతం సీడీ ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమార్, ఎస్పీ, కలెక్టర్, ఎమ్మెల్యే వేగేశన

వరద.. తగ్గుముఖం

- ఊపిరి పీల్చుకున్న లంక గ్రామాల ప్రజలు
- ముంపు నుంచి బయటపడుతున్న పంటలు

కొల్లూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులు వణికించిన వరుణుడు.. శాంతించాడు. పైగా ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల తగ్గింది. దీంతో కృష్ణమ్మలో వరద ప్రవాహ ఉధృతి క్రమేణా తగ్గుతోంది. దీంతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మూడు రోజులుగా ప్రకాశం బ్యారేజీ నుంచి భారీ స్థాయిలో నీటి విడుదలతో లంక గ్రామాలకు వరద నీరు పోటెత్తింది. వరద ముంచేస్తుందని లంక గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా భయాందోళనలకు గురయ్యారు. శుక్రవారం వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో పాటు ముంపునకు గురైన వాణిజ్య పంటలు కూడా బయటపడటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రకాశం బ్యారేజి నుంచి నీటి విడుదలను తగ్గించడంతో నదిలో శుక్రవారం నాలుగు అడుగులు మేర మట్టం తగ్గింది. లోతట్టు ప్రాంతాల్లో పంటలు మాత్రం ఇప్పుడిప్పుడే వరద నీటి నుంచి బయట పడుతున్నాయి. వరద ముప్పు తొలగడంతో అధికారులు కూడా ఊపిరి పీల్చుకున్నారు.


అరవింద వారధి వద్ద తగ్గిన వరద ఉధృతి


వరద ముంపు నుంచి బయట పడుతున్న కంద పంట


పోతార్లంక వద్ద వరద నీటి నుంచి బయట పడిన అరటి తోట

క్వారీల్లో భద్రత గాలికి

- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- అనుమతులు గోరంత, తవ్వేది కొండంత

బల్లికురవ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అనుమతులు ఉండవు.. ఇష్టం వచ్చినట్లు తవ్వకాలు.. కూలీలకు కనీస భద్రతా చర్యలు లేవు.. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరు.. ఇదీ బల్లికురవ మండల పరిధిలోని గ్రానైట్, కంకర క్వారీల్లోని పరిస్థితి. బతుకు తెరువు కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలు క్వారీ యజమానుల నిర్లక్ష్యంతో శవాలుగా మారుతున్నారు. భద్రత పరంగా ఎలాంటి చర్యలు లేకపోవటం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు పట్టడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నెలలో వరుసగా రెండు ప్రమాదాలు జరిగి ఒడిస్సాకు చెందిన ఏడుగురు కూలీలు మృతి చెందడం చూస్తే నిబంధనలు ఏ విధంగా అమలు అవుతున్నాయో తెలుసుకోవచ్చు. బల్లికురవ మండలం నక్కబొక్కలపాడు, రామాంజనేయపురం, వల్లాపల్లి మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామాలలో సుమారు 20 కంకర క్వారీలు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి సరైన అనుమతులు లేవు. ఇష్టానుసారంగా కొందరు క్వారీలను నిర్వహిస్తున్నారు. అనుమతులు గోరంత, తవ్వేది కొండంతా అన్నట్లు కంకరను బ్లాస్టింగ్‌లు పెట్టి తవ్వుతున్నారు. తలకు హెల్మెట్ కూడా పెట్టుకోకుండానే తాడు సహాయంతో వంద అడుగుల ఎత్తులో కూలీలు ప్రమాదకర స్థితిలో డ్రిల్లింగ్ చేస్తుంటారు. ఇలాంటి సమయంలోనే కూలీలు జారి పడి గాయాల పాలవడంతో పాటు పలువురు మరణిస్తుంటారు. తాజాగా నక్కబొక్కలపాడు గ్రామ పరిధిలో ఉన్న ఒక కంకర క్వారీలో ఒడిస్సాకు చెందిన కూలీ డ్రిల్లింగ్ చేస్తూ కొండపై నుంచి కింద పడి మృతి చెందాడు. గ్రానైట్ క్వారీలో ఈ నెలలోనే ఆరుగురు కూలీలు మృతి చెందిన విషయం తెలిసిందే. అధికారులు నెల వారీ మామూళ్ల మత్తులో క్వారీల్లో నిబంధనల అమలు గురించి పట్టించుకోవటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రమాదాలు జరిగితే ఒకటి రెండు రోజులు హడావుడి చేసి ఆ తర్వాత పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.


బల్లికురవ ప్రాంతంలో ప్రమాద భరితంగా కంకర క్వారీ

బ్లాస్టింగ్‌లతో బెంబేలు..

క్వారీల్లో పగలూ రేయి తేడా లేకుండా బ్లాసింగ్‌లు చేస్తున్నారు. ఎగిసిపడే దుమ్ముధూళితో సమీప పంట పొలాలు నిండిపోతున్నాయి. ఎగిరిపడే రాళ్లు ఆ పరిసర ప్రాంత వాసులను బెంబేలెత్తిస్తున్నాయి. పొలాల్లో పనులు చేసుకునే రైతులు రాళ్ల కారణంగా గాయపడిన ఘటనలు ఉన్నాయి. బ్లాస్టింగ్ శబ్ధంతో పాటు దుమ్ముతో రైతులు, పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. స్టోన్ క్రషర్లతో చెలరేగే దుమ్ముతో తాము వ్యాధుల బారిన పడుతున్నామని రామాంజనేయపురం గ్రామ ప్రజలు వాపోతున్నారు.

స్త్రీశక్తి.. సంబరం

- ఉచిత ప్రయాణంపై అతివల ఆనందం
- అట్టహాసంగా ప్రారంభం.. మహిళల కోలాహలం
- బస్సుల్లో జీరో టిక్కెట్ జారీ చేసిన ప్రజాప్రతినిధులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూపర్ సిక్స్‌లో మరో పథకం స్త్రీశక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం జిల్లా అంతటా శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఉచిత ప్రయాణం హామీ అమలు ఎప్పడెప్పుడా అని ఎదురు చూసిన మహిళలకు స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ప్రభుత్వం స్త్రీశక్తికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలో స్త్రీ శక్తిని ప్రారంభించిన వెంటనే జిల్లాలోని డిపోల్లో ప్రజాప్రతినిధులు పథకాన్ని ప్రాంభించారు. ఉచిత ప్రయాణం అమల్లోకి రావడంతో అతివల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. బస్సుల్లో జీరో టిక్కెట్ జారీతో మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం శుక్రవారం సాయంత్రం నుంచి అమల్లోకి వచ్చింది. జిల్లా వ్యాప్త కార్యక్రమం చీరాలలో జరగ్గా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్ వెంకటమురళి, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. వేమూరులో జరిగిన స్త్రీశక్తి పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆనంద్ బాబు పాల్గొన్నారు. వేమూరు నుంచి వెల్లటూరు వరకు బస్సులో మహిళలతో కలిసి ఆయన ప్రయాణించారు. రేపల్లె బస్టాండ్‌లో ఆర్డీవో రామలక్ష్మితో పాటు మంత్రి అనగాని సోదరుడు శివప్రసాద్, కూటమి నేతలు ఉచిత బస్సు పథకానికి శ్రీకారం చుట్టారు. అద్దంకి, బాపట్ల, పర్చూరు నియోజకవర్గాల్లో కూటమి పార్టీల ద్వితీయశ్రేణి నేతలతో పాటు అధికారులు పాల్గొని ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించారు.


చీరాలలో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, కలెక్టర్ వెంకటమురళి


వేమూరు: మహిళలతో ప్రయాణం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ఉండవల్లిలో శ్రీకారం

ఉచిత బస్సును ప్రారంభించిన చంద్రబాబు
పవన్, లోకేశ్, మహిళలతో కలిసి విజయవాడకు సీఎం

తాడేపల్లి, మంగళగిరి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం స్త్రీశక్తి పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు ఉండవల్లి నుంచి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఉండవల్లి గుహాలయాల మినీ బస్టాప్ వద్ద నుంచి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, మహిళా ప్రయాణికులతో కలిసి మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులో విజయవాడ బస్టాండ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న మహిళల రోజువారీ ప్రయాణ అవసరాలు, కుటుంబ జీవనోపాధికి సంబంధించిన అంశాలను గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. పవన్‌కల్యాణ్ బస్సులో మహిళలతో సరదాగా కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ప్రయాణమార్గంలో ఉండవల్లి, భరతమాత సెంటర్, మణిపాల్ ఆస్పత్రి తదితర ప్రాంతాలలో ప్రజలు, కూటమి కార్యకర్తలు పెద్దసంఖ్యలో చేరి తమతమ పార్టీ పతాకాలతో ఉచిత బస్సులకు స్వాగతం పలికారు. మంగళ హారతులతో మహిళలు స్వాగతం పలికగా పలుచోట్ల ప్రజలు బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు.కార్యక్రమంలో ఏపీ బీజేపి చీఫ్ మాధవ్, కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.


ఉండవల్లి నుంచి బస్సులో ప్రయాణిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్



భోజనకుతూహలం

గడ్డల్ని కరిగించే కంద ఆకులు

సంస్కృతంలో కందకు 'సూరణం', 'వేరు వెల్లకి' అనే పేర్లు ఉన్నాయి. శూరుడిలా పోరాడేది కాబట్టి ఈ దుంపను సూరణం అంటారు. ఆయుర్వేద గ్రంథాల ప్రకారం- కడుపులో పెరిగే గడ్డలు, ఏలిక పాములపై ఇది పోరాడుతుంది. భౌగోళికంగా చూస్తే - కంద మొక్క దక్షిణాదివారి స్వంతం. ఉష్ణ ప్రాంతాల్లో ఎక్కువగా పెరిగే మొక్క ఇది! భారతదేశం మొత్తం మీద తెలుగు నేలపైన పెరిగే కందకు ప్రసిద్ధి ఎక్కువ. పూర్వం వానప్రస్థాశ్రమంలో కంద మూలాలు తింటూ జీవించేవారని చెప్పేవారు. కంద మూలాలంటే సాధారణ అర్థంలో దుంపకూరలని! కంద అనేది సంస్కృత పదం, దుంప అనేది తెలుగు. ఈ రకంగా చూస్తే కంద లాంటి దుంప కూరలు, ఇతర ఉడకబెట్టిన దుంపలు తింటారని అర్థం. ఇక కంద ఆకులు వెడల్పుగా పెద్దవిగా రెమ్మలురెమ్మలుగా ఉంటాయి. వీటిలో ఎ- విటమిన్, ప్రొటీన్లు, ఫైబర్ ఉంటాయి. ఇక కంద వల్ల కలిగే లాభాలేమిటో చూద్దాం..



- కంద ఆకులకు వేడి చేసే స్వభావం ఉంటుంది. అయితే ఈ స్వభావం వల్ల కంద ఆకులు శరీరంలోని ఉన్న దోషాలను పోగొడతాయి. కఫదోషం వల్ల కలిగే వ్యాధులు ఉన్నవారికి ఈ ఆకులను వండిపెట్టవచ్చు.
- ఒకప్పుడు బోదవ్యాధి ఎక్కువగా ఉండేది. ఆ సమస్య ఉన్నవారికి కంద మంచి ఔషధం.
- కంద కాడల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇవి పొట్టను మృదువుగా చేస్తాయి.
- కంద ఆకులను ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువగా తింటారు. అయితే లేత కంద ఆకులను తింటేనే మంచిది. ముదురు ఆకుల్లో ఆగ్జలైట్ క్రిస్టల్స్ ఎక్కువగా ఉంటాయి. ముదురు ఆకులను నేరుగా తింటే కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి. ఒకవేళ ముదురు ఆకులను తినాలనుకొనేవారు ఆకులను శుభ్రపరచి, సన్నగా తరిగి, మజ్జిగలో వేసి బాగా మెత్తపడేదాకా ఉడికిస్తే ఈ క్రిస్టల్స్ తొలగిపోతాయి.

● గంగరాజు అరుణాదేవి

మేకప్

తళుక్కున మెరవాలంటే...

ముఖ చర్మాన్ని కాన్వాస్‌గా మలిచి, అందంగా తీర్చిదిద్దడమే మేకప్. అందుకోసం కొంత ఓర్పు, నేర్పు అవసరమవుతాయి. నాణ్యమైన ఉత్పత్తులను ఎంచుకోవడం ఒక ఎత్తైతే, వాటిని తగుమాత్రంగా ముఖానికి అద్దుకోవడం మరొక ఎత్తు. మెరుపులీనే తారలా తళుక్కుమనడం కోసం ఇవిగో ఈ మేకప్ కిటుకులు పాటించండి.



షేపింగ్: ముఖం కోలగా మలచాలన్నా, గుండ్రంగా తీర్చిదిద్దాలన్నా అందుకు తగిన మేకప్ మెలకువలు అనుసరించాలి. షాడో, బ్రాంజ్, కాంపాక్ట్‌ల షేడ్‌లను ఆచితూచి ఎంచుకుని, అవసరమైన చోటే అద్దుకోవాలి. ముక్కును తీర్చిదిద్దే తీరు మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. అలాగే దవడలు, చెవుల దగ్గర డెప్త్‌ను ఏ మేరకు పెంచాలో అంచనా వేయాలి.

ముడతలు: నుదురు, పెదవులు, కళ్ల కింది ప్రదేశాల్లో ముడతలు దాచడం కోసం అవసరానికి మించి కన్‌సీలర్ ఉపయోగించకూడదు. సహజసిద్ధమైన లుక్‌ను సొంతం చేసుకోవడం కోసం కళ్ల కింద ఎరుపు రంగు షేడ్‌ను పలుచగా అద్దుకుని, దాని మీద ఫౌండేషన్ అప్లై చేసుకోవాలి. కన్‌సీలర్‌ను పలుచగా అద్దుకుని, ఫౌండేషన్‌లో కలిసిపోయేలా చూసుకోవాలి.

హైలైట్: ముఖంలో కనుబొమలు, పెదవులు... ఇలా ప్రతి ఒక్కరి ముఖంలో ఏదో ఒక ఆకట్టుకునే అంశం ఉంటుంది. కాబట్టి ఆ అంశాన్ని సెంటర్ ఆఫ్ అటెన్షన్‌గా చేసి, దానికి తగ్గట్టు ముఖాన్ని మలిచే ప్రయత్నం చేయాలి. ఆకర్షణీయమైన కళ్లు ఉన్నవారు బోల్డ్ లైనర్‌ను ఉపయోగించాలి. పౌట్‌ను గుర్తించడం కోసం ముదురు రంగు లిప్‌స్టిక్ ఎంచుకోవాలి.

లైట్‌గా మొదలు పెట్టి: మేకప్ ఉత్పత్తులను వీలైనంత తక్కువగా వాడడం అలవాటు చేసుకోవాలి. కొద్దిగా కన్‌సీలర్‌ను చర్మం మీద అప్లై చేసి బ్రష్‌తో బ్లెండ్ చేసుకోవాలి. ఇంకొద్దిగా అవసరం పడితే, మళ్లీ అప్లై చేసుకోవాలి. అలాగే కన్‌సీలర్‌ను అప్లై చేయడం కోసం డో ఫుట్ అప్లికేటర్‌ను ఉపయోగించాలి.

ఐ షాడో బ్రష్: కనురెప్పల మీద ముడతలు ఉంటే, ఫ్లాట్ బ్రష్‌కు బదులుగా ఫ్లఫీగా ఉండే బ్రష్ వాడాలి. సన్నని మొన కలిగిన బ్రష్ వాడడం వల్ల షాడో, కనురెప్పల ముడతల్లో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే చివర్లో క్రీజ్ బ్రష్‌తో అదనపు షాడోను తొలగించుకోవాలి.

పిల్లలు ఆలస్యంగా పడుకుంటున్నారా..?

పిల్లలు నిద్రకు ఉపక్రమించే సమయం, ఎన్ని గంటలు పడుకుంటున్నారనే అంశాలు వారి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు పోషకాహారంతోపాటు సరైన నిద్ర కూడా అత్యవసరమని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు సమయానికి నిద్రపోవడం వల్ల కలిగే లాభాలు, ఆలస్యంగా పడుకోవడం వల్ల కలిగే నష్టాల గురించి తెలుసుకుందాం...



సమయానికి నిద్రిస్తే...

- పిల్లలు రోజూ సరైన సమయానికి నిద్రించడం వల్ల శారీరకంగా వారి ఎదుగుదల బాగుంటుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. నేర్చుకొనే సామర్థ్యం పెరుగుతుంది. హార్మోన్లు సమతుల్యంగా ఉంటాయి. తరచుగా ఒత్తిడికి గురికాకుండా భావోద్వేగాల పరంగా నియంత్రణలో ఉంటారు. ఆకలి పెరిగి చక్కగా ఆహారం తినగలుగుతారు. దీనివల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. ఎటువంటి వ్యాధులు రాకుండా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు.

ఆలస్యమైతే...

- నిద్ర సరిపోక కళ్లు, మెదడు అలసిపోతాయి. దీంతో పిల్లలు రోజంతా చిరాకుగా ప్రవర్తిస్తుంటారు. జీర్ణ సమస్యలు, ఆకలి లేకపోవడం, మలబద్ధకం లాంటివి ఎదురవుతాయి. కొంచెం పెద్ద పిల్లలకయితే ఏకాగ్రత కుదరదు. చదివిన అంశాలు గుర్తుండవు. పరీక్షలు సరిగా రాయలేక నిరాశ, ఆందోళనలకు గురవుతూ ఉంటారు. పిల్లలు ఆలస్యంగా పడుకుని, ఆలస్యంగా నిద్రలేస్తుంటే తల్లిదండ్రులు గమనించి ఆ అలవాటును మానిపించాలి.

ఏ సమయానికి పడుకోవాలంటే...

- చిన్న పిల్లలు రాత్రి ఎనిమిదింటికల్లా పడుకోవడం మంచిది. బడికి వెళ్లే పిల్లలు రాత్రి తొమ్మిది లోపు పడుకోవాలి. కనీసం ఎనిమిది నుంచి పది గంటలపాటు నిద్రించడం వారి ఆరోగ్యానికి మంచిది.

వంటిల్లు

కృష్ణునికి అటుకులు, పాలు, మీగడ, వెన్న అంటే ఇష్టమని మనందరికీ తెలుసు. కృష్ణాష్టమి రోజున వీటితో రకరకాల వంటకాలు తయారుచేసి కృష్ణునికి నివేదిస్తూ ఉంటాం. తక్కువ సమయంలో తేలికగా అటుకులతో తయారుచేసే రుచికరమైన నైవేద్యాల గురించి తెలుసుకుందాం...



● పాలు చిలకరించకుండా మరో నాలుగు చెంచాల నెయ్యి వేసి చేస్తే లడ్డూలు చాలా రోజుల వరకు నిల్వ ఉంటాయి.

అల్లరి కృష్ణునికి అటుకుల నైవేద్యం..!

అటుకుల లడ్డు

కావాల్సిన పదార్థాలు

అటుకులు- రెండు కప్పులు, నెయ్యి- అయిదు చెంచాలు, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పలుకులు- కొన్ని, ఎండు కొబ్బరిపొడి- రెండు చెంచాలు, యాలకులు- మూడు, తురిమిన బెల్లం- ముప్పావు కప్పు, కాచి చల్లార్చిన పాలు- మూడు చెంచాలు

● అటుకులను చిన్న మంట మీద నెమ్మదిగా వేయించుకోవాలి. లేదంటే తొందరగా మాడిపోతాయి.

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో అటుకులు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. వాటిని చల్లార్చాలి. స్టవ్ మీద పాన్ పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో జీడిపప్పు పలుకులు, బాదం పలుకులు వేసి ఎర్రగా వేయించాలి. తరవాత ఎండు కొబ్బరి పొడి వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి.
- మిక్సీలో చల్లారిన అటుకులు, యాలకులు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత బెల్లం తురుము వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని జీడిపప్పు- బాదం పలుకుల మిశ్రమంలో వేసి బాగా కలపాలి. అందులో మూడు చెంచాల నెయ్యి వేసి కొద్దికొద్దిగా పాలు చిలకరిస్తూ ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్దికొద్దిగా తీసుకుంటూ లడ్డూలు చుట్టుకోవాలి. అంతే..! కృష్ణునికి ఎంతో ఇష్టమైన అటుకుల లడ్డు రెడీ..!

అటుకులు పెసరపప్పు పాయసం

కావాల్సిన పదార్థాలు

అటుకులు- ఒక కప్పు, పెసరపప్పు- అర కప్పు, బెల్లం- ఒక టింబావు కప్పులు, నెయ్యి- నాలుగు చెంచాలు, కాచి చల్లార్చిన పాలు- మూడు కప్పులు, యాలకుల పొడి- అర చెంచా, కొబ్బరి ముక్కలు- కొన్ని, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పప్పులు- కొన్ని, కిస్‌మిస్‌లు- కొన్ని, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో పెసరపప్పు వేసి దోరగా వేయించి మరో గిన్నెలోకి తీయాలి. అందులో నీళ్లు పోసి పెసరపప్పును రెండుసార్లు కడగాలి. తరువాత రెండు కప్పుల నీళ్లు పోసి పావుగంటసేపు నానబెట్టాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో బెల్లం వేసి పావుకప్పు నీళ్లు పోయాలి. బెల్లం పూర్తిగా కరిగిన తరవాత స్టవ్ మీద నుంచి దించి మరో గిన్నెలోకి వడబోయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి మూడు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో కొబ్బరి ముక్కలు, జీడిపప్పు పలుకులు, బాదం పప్పులు, కిస్‌మిస్‌లు వేసి ఎర్రగా వేపి పళ్లెంలోకి తీసుకోవాలి. తరువాత అటుకులు వేసి, దోరగా వేయించి మరో పళ్లెంలోకి తీయాలి. అదే గిన్నెలో నానబెట్టిన పెసరపప్పును నీళ్లతో సహా వేసి ఉడికించాలి. మధ్యలో ఒక చెంచా నెయ్యి వేసి కలపాలి. పెసరపప్పు మెత్తగా ఉడికిన తరువాత వేయించిన అటుకులు వేసి కలపాలి. రెండు నిమిషాల తరువాత పాలు పోసి కలపాలి. ఈ మిశ్రమాన్ని అయిదు నిమిషాలు ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. తరవాత బెల్లం నీళ్లు పోసి కలపాలి. మళ్లీ గిన్నెను స్టవ్ మీద పెట్టి రెండు నిమిషాలు మిశ్రమాన్ని ఉడికించాలి. అదే సమయంలో... వేయించి పెట్టుకున్న కొబ్బరిముక్కలు, జీడిపప్పు, బాదం పప్పులు, కిస్‌మిస్‌లతోపాటు యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. అంతే! కమ్మని అటుకులు-పెసరపప్పు పాయసం నైవేద్యానికి రెడీ!

● పాయసాన్ని జారుగా ఉన్నప్పుడే స్టవ్ మీద నుంచి దించాలి. అది చల్లారిన తరవాత కొద్దిగా గట్టిపడుతుంది.



● బెల్లం నీళ్లు పూర్తిగా చల్లారిన తరవాతనే పాలు-అటుకులు-పెసరపప్పు మిశ్రమంలో కలపాలి. లేదంటే పాలు విరిగిపోవచ్చు.

● అటుకుల్లో ఎ, బి, సి, కె విటమిన్లతోపాటు ప్రొటీన్లు, పిండిపదార్థాలు, ఐరన్, పీచుపదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అటుకులను తరచూ తినడం వల్ల నీరసం తగ్గుతుంది. రక్తహీనత, జీర్ణ సమస్యలు, గుండె జబ్బులు దరిచేరవు. రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది. అటుకుల్లో క్యాలరీలు, కొవ్వులు ఉండవు కాబట్టి ఎక్కువగా తిన్నప్పటికీ శరీరం బరువు పెరగదు. ఇవి త్వరగా జీర్ణమవుతాయి. అందుకే అటుకులను పిల్లలు, వృద్ధులు, గర్భిణులకు బలవర్ధకమైన ఆహారంగా నిపుణులు సూచిస్తున్నారు.

సంకల్పం

నాట్యం... పరవశం

మూడు గంటలు భరతనాట్యం... మధ్యలో పావుగంట విరామం... అలా ఏకధాటిగా 170 గంటల ప్రదర్శన..! సాధ్యమేనా..? అందరిదీ ఇదే సందేహం. కానీ... అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసి చూపించింది ఇరవయ్యేళ్ల రెమోనా ఎవెట్టే పెరీరా. అమ్మ అండతో... స్నేహితులు, సన్నిహితుల ప్రోత్సాహంతో... ఈ మెగా ఫీట్‌ను దిగ్విజయంగా ముగించి... 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించిన రెమోనా కథ ఇది.



"మాటల్లో చెప్పలేని భావాలను నాట్యంతో వ్యక్తీకరించవచ్చు. సంప్రదాయ నృత్యంలోని గొప్పదనం అదే. కాళ్లకు గజ్జె కట్టి, శరీరం లయబద్ధంగా కదులుతున్నప్పుడు నన్ను నేను మరిచిపోతాను. నర్తిస్తున్నంతసేపూ ఏదో తెలియని పరవశానికి లోనవుతాను. నేను అమితంగా ఇష్టపడింది, తొలిసారి ప్రేమలో పడింది భరతనాట్యంతోనే. కర్ణాటక రాష్ట్రం మంగళూరు నగరం మాది. ఊహ తెలియనప్పుడే మా అమ్మ నన్ను తీసుకువెళ్లి భరతనాట్యం గురువుకు అప్పగించింది. ఇక అప్పటి నుంచీ నాకు అదే లోకం అయిపోయింది. దీని వెనుక ఒక చిన్న కథ ఉంది. సంప్రదాయ నృత్యం అభ్యసించాలని మా అమ్మ ఎన్నో కలలు కన్నది. కానీ సామాజిక కట్టుబాట్ల పేరుతో ఇంట్లోవాళ్లు అనుమతించలేదుట. అందుకే నాకు కళలు నేర్పించాలని నిర్ణయించుకుంది. కానీ భరతనాట్యం వైపు వెళ్లమని తను నన్ను బలవంతం పెట్టలేదు. దీంతోపాటు పెయింటింగ్, ఇతర నాట్య రీతులు కూడా ఆరంభంలో సాధన చేశాను. అయితే ఎందుకో తెలియదు... అన్నిటికంటే నన్ను భరతనాట్యమే అమితంగా ఆకర్షించింది.

ఆలోచన అలా వచ్చింది...

ఆరంభం నుంచీ మా గురువు శ్రీవిద్య మురళీధర్ గారి దగ్గరే నాట్యం అభ్యసిస్తున్నాను. భరతనాట్యం నాకు ఒక సంప్రదాయ నృత్య సాధన మాత్రమే కాదు... భావోద్వేగాల బంధం. ఆధ్యాత్మిక అనుబంధం. నేను వేరు, నాట్యం వేరు కాదు. ప్రస్తుతం నేను బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. విద్య ఎంత ముఖ్యమో కళ కూడా అంతే ముఖ్యం. అందులో ఎప్పుడూ ఏదో కొత్తగా చేయాలని తపిస్తుంటాను. అలా ఒక రోజు ఇన్‌స్టాగ్రామ్ చూస్తుంటే... 'డ్యాన్స్ మారథాన్' అని కనిపించింది. అలాంటిది ఒకటి ఉంటుందని కూడా అప్పటివరకు నాకు తెలియదు. ఆశ్చర్యం కలిగింది. నన్ను బాగా ఆకర్షించింది. 'నేను ఎందుకు ప్రయత్నించకూడదు' అనిపించింది.

అనుకున్నది 24 గంటలే... కానీ...

ఎప్పుడైతే ఆలోచన వచ్చిందో వెంటనే కార్యరంగంలోకి దిగాను. డ్యాన్స్ మారథాన్‌కు సంబంధించిన అప్లికేషన్ మా కాలేజీవాళ్లు తెప్పించారు. ముందుగా అనుకున్నది 24 గంటల మారథాన్. కానీ అప్లికేషన్ నింపుతుంటే... 170 గంటలు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. ఆ సంఖ్య నా మదికి ఎలా తట్టిందో తెలియదు. దరఖాస్తులో రాసే ముందు అమ్మకు చెప్పాను. తను అవాక్కయింది. కాసేపటికి తేరుకొని... 'అంటే ఎన్ని రోజులు' అని అడిగింది. 'సుమారుగా ఏడు రోజుల రెండు గంటలు' అన్నాను. ఆశ్చర్యంగా నా వైపు చూస్తూ... 'నిజంగానే చేద్దామనుకొంటున్నావా' అంటే... 'అవును' అని బదులిచ్చాను. మరో ఆలోచన లేకుండా... 'అయితే నా మద్దతు నీకు ఉంటుంది' అంది అమ్మ.



ప్రత్యేక సన్నాహకాలు లేకుండానే...

ఈవెంట్‌కు కొన్ని వారాల ముందే 170 గంటలు నాన్‌స్టాప్‌గా భరతనాట్య ప్రదర్శన ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. దాంతో సన్నాహకాలకు ఎక్కువ సమయం లేకుండా పోయింది. అయితే నా మనసులో ఒకటే అనుకున్నా... 'వారం రోజుల పాటు నిద్ర ఉండదు. కనుక దానికి ముందు బాగా నిద్ర పోవాలి' అని. ఈ మారథాన్ కోసం నేను సన్నద్ధమైంది ఏదైనా ఉందంటే... అది కంటి నిండా కునుకు తీయడమే. చివరకు ఈవెంట్ రోజు, అంటే జూలై 21 వచ్చేసింది. ప్రదర్శన మొదలుపెట్టాను. మా కాలేజీ ఆడిటోరియంలోనే. నాకు తెలుసు... మొదటిరోజు హాయిగానే సాగిపోతుందని. మూడో రోజు నుంచి కష్టపడాల్సి వస్తుందని అనుకున్నా. కానీ నా అంచనాలు తలకిందులు అయ్యాయి. తొలి రోజే ఆపేద్దామనుకున్నా. అమ్మ 'నువ్వు చేయగలవు' అని ఆత్మవిశ్వాసం నింపింది. ఆడిటోరియంలో నా స్నేహితులు, స్థానికులు, అధ్యాపకులు... అందరూ నాకు అండగా నిలిచారు. నాకు నిద్ర వచ్చినప్పుడల్లా... చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ ఉత్సాహపరిచారు. మూడు గంటల నాట్యం... మధ్యలో పావుగంట విరామం. ఎక్కువగా అరటి, ఆపిల్, జామపండ్లు, కొబ్బరి నీళ్లతోనే సరిపెట్టుకున్నా. నిద్ర మరీ ముంచుకొస్తే ఒకటి రెండు సిప్‌లు కాఫీ. రాత్రి అయ్యేసరికి విపరీతమైన వెన్ను, కాళ్ల నొప్పులు. తట్టుకోలేక కళ్లల్లో నీళ్లు తిరిగేవి. అన్నిటికంటే పెద్ద సవాలు... నిద్ర ఆపుకోవడం. అన్నిటినీ భరించాను. అందరి సహకారంతో జూలై 28న విజయవంతంగా మారథాన్ ముగించాను.

అమ్మ లేకపోతే నేను లేను...

నా జీవితంలోనే కాదు... నా ఈ నాట్య ప్రయాణంలోనూ మా అమ్మ పాత్ర ప్రముఖమైనది. వెల కట్టలేనిది. నా ప్రతి దశలో తోడై, అడుగడుగునా ప్రోత్సహిస్తూ వస్తోంది. అంతేకాదు... నాట్య ప్రదర్శనకు అవసరమైన దుస్తులు తనే డిజైన్ చేసి, కుడుతుంది. అమ్మ నా నిశ్శబ్ద భాగస్వామి. నన్ను నలుగురిలో గొప్పగా నిలబెట్టడానికి అహర్నిశలూ కష్టపడుతుంది. తను లేకపోతే నేను లేను. నా మారథాన్ సమయంలో అమ్మ కూడా నిద్ర పోలేదు. సరిగ్గా తినలేదు. నిరంతరం నన్ను అంటిపెట్టుకొనే ఉంది.

సరికొత్త రికార్డు...

నా ప్రదర్శన 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నమోదైంది. ఇది నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. రికార్డు నెలకొల్పాననే ఆనందం కన్నా... అంత పెద్ద లక్ష్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేయగలిగాననేదే నాకు ఎక్కువ సంతృప్తిని ఇస్తోంది. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం నాకు ఇదే మొదటిసారి కాదు. గతంలో పిల్లలకు ఇచ్చే అత్యున్నత అవార్డు... 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'ను నరేంద్ర మోదీ చేతుల మీదుగా అందుకున్నాను. నేను ఎక్కడ ఉంటే అక్కడ భరతనాట్యం ఉండేలా కృషి చేస్తాను. ప్రస్తుతం ట్రాన్స్‌జెండర్స్ పిల్లలకు నృత్యం నేర్పిస్తున్నాను. భరతనాట్యంలో పీహెచ్‌డీ చేయాలనేది నా కల. తద్వారా ఈ కళారూపాన్ని మరింత లోతుగా అర్థంచేసుకొనే అకాశం లభిస్తుంది కదా."

వ్యక్తిగత గౌరవం పెరిగేలా...

మనం వ్యక్తిగతంగా ఎదగడానికి మన అలవాట్లే దోహదం చేస్తాయి. ఒక్కోసారి తెలిసీ తెలియక చేసే పొరబాట్లు నలుగురిలో నగుబాటుకి గురిచేస్తూ ఉంటాయి. అలాకాకుండా సమాజంలో ఉన్నతంగా నిలవాలంటే ఏవిధంగా మెలగాలో తెలుసుకుందాం...

- కొంతమంది వ్యక్తిగతమైన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ ఉంటారు. గంట గంటకూ కామెంట్లు, లైక్‌లు చూస్తూ ఉంటారు. అనుకున్నట్లు జరిగితే సంతోషమే. కానీ అలా కానిపక్షంలో భావోద్వేగాల మీద నియంత్రణ కోల్పోతూ ఉంటారు. దీనివల్ల మానసికంగా అశాంతి, అసహనం, కోపం పెరుగుతాయి. ఇవి వ్యక్తిగత గౌరవాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే సామాజిక మాధ్యమాల్లో గడపడాన్ని తగ్గించుకోవాలి.
- కొంతమంది ఎప్పుడూ ఎదుటివారిలో తప్పులు వెతుకుతూ ఉంటారు. చిన్న చిన్న అంశాలనే పెద్దవిగా చేసి అనవసరమైన గందరగోళం సృష్టిస్తూ ఉంటారు. అలాకాకుండా తప్పు అనిపించిన



అంశాన్ని నేరుగా మృదువుగా చెప్పడం మంచిది. దీనివల్ల నలుగురిలో సానుకూలంగా వ్యవహరించడం అలవడుతుంది.
- వాయిదా వేసే ధోరణి చాలామందిలో కనిపిస్తూ ఉంటుంది. మీటింగ్ లేదా ఫంక్షన్‌కి వస్తానని చెప్పి ఆఖరు నిమిషంలో రానని చెప్పడం, చేయాల్సిన పనులను ఎప్పటికప్పుడు వాయిదా వేయడం లాంటివి వ్యక్తిగత గౌరవాన్ని తగ్గిస్తాయి. కాలయాపన చేయకుండా క్రమశిక్షణతో మెలగడం అలవాటు చేసుకోవాలి.

అగ్రస్థానం దిశగా.. అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

సమీకృత ఆక్వా పార్కు పనులు జరుగుతున్నాయన్నారు. పనులను సత్వరం పూర్తి చేసి త్వరలోనే రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులకు వేట నిషేధ భృతిని పెంచి అందించామన్నారు. శుక్రవారం నుంచి అమలు చేయబోయే స్త్రీశక్తి పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా రోజుకు దాదాపు 50,000 మంది మహిళలు ఉచిత ప్రయాణ లబ్ధి చేకూరనున్నదన్నారు. పీ4 పథకం ద్వారా ఏళ్ల తరబడి పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలకు బంగారు కుటుంబాల జాబితాలో చేర్చి మార్గదర్శకుల ద్వారా ఊతమిచ్చే చర్యలకు శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, కొండయ్య, ఏపీ చేనేత కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత, ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

మైక్రో ఆర్ట్ ప్రత్యేక ఆకర్షణ..

చీరాలకు చెందిన మహిత మైక్రో ఆర్ట్ ప్రతిభతో 65 పెన్సిళ్లపై డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్ర, 86 పెన్సిళ్లపై నెల్సన్ మండేలా, 73 పెన్సిళ్లపై మహాత్మగాంధీ, 25 పెన్సిళ్లపై డొక్కా సీతమ్మ జీవిత చరిత్రను లిఖించింది. వీటితో పాటు 800 పెన్సిళ్లపై భగవద్గీతలోని 700 శ్లోకాలు లిఖించడం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది

జాతీయ జెండా పట్ల అపారమైన గౌరవం ఉంది

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తనకు దేశమంటే ఎంతో భక్తి అని, జాతీయ జెండా పట్ల అపారమైన గౌరవం ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. పంద్రాగస్టు వేడుకల కోసం లోపలికి వెళ్లే క్రమంలో ముగ్గును గమనించకపోవడం యాదృచ్ఛికంగా జరిగింది తప్ప ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని ఆయన శుక్రవారం వివరణ ఇచ్చారు. ఉదయం 8 గంటల లోపల వినుకొండ పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో గల కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో జరిగిన జెండా వందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. జరిగిన తప్పిదంపై విచారణ వ్యక్తం చేశారు. జరిగిన తప్పిదాన్ని తెలుసుకున్న వెంటనే ఆయన సుమరు 10 నిమిషాల పాటు ప్రభుత్వ కార్యక్రమాలను ఆపుకొని.. పొరపాటు అని గ్రహించిన అనంతరం సరిదిద్దుకొని క్షమాపణ చెబుతూ తిరంగ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి దేశభక్తి కోసం పోరాడి స్పోర్ట్స్‌లో మొదటి స్థానం ఉన్నాని, ఇది రాజకీయం చేయడం తగదని కోరారు. ఇకపై మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నానని, జరిగిన ఘటనకు చింతిస్తూ జాతీయ జెండా గౌరవాన్ని కాపాడటంలో ఎల్లప్పుడు అంకితభావంతో పనిచేస్తానన్నారు.

కో -ఆపరేటీవ్ అర్బన్ బ్యాంకు కార్యవర్గం ఎన్నిక

గుంటూరు సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు కో - ఆపరేటీవ్ అర్బన్ బ్యాంకు కొత్త కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. అధ్యక్షుడిగా మహమ్మద్ ఇనాయతుల్లా, ఉపాధ్యక్షుడిగా బండారుపల్లి వేణుగోపాలరావు, కార్యదర్శిగా షేక్ మస్తాన్ వలి, జాయింట్ కార్యదర్శిగా పాశం సుబ్బారెడ్డి, కోశాధికారిగా గుండె పూడి హరిత శ్రావ్య ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నార్నె శ్రీనివాస్ చౌదరి, దొడ్డ ఓం ప్రకాష్, జొన్నలగడ్డ హేమావతి, కోలుకొండ వెంకట రాజేష్,మర్రిపూడి తంగెళ్ల ఎన్నికయ్యారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఏఐటీయూసీ వెలుగూరి రాధాకృష్ణమూర్తి, కేవీఎస్ రవికుమార్ ఎన్నికైన వారిని అభినందించారు.

జీడి మామిడి తోటలోకి వచ్చిన జింక పిల్ల

బాపట్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు కాని బాపట్ల జీడి మామిడి పరిశోధన స్థానం జీడి తోటలో శుక్రవారం ఓ జింక సంచరి ంచింది. అటు కలెక్టరేట్, ఇటు ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల మధ్యలో ఉన్న జీడి మామిడి తోటలో లేడి పిల్లను.. కుక్కలు వెంబడించాయి. అటవీ శాఖాధికారు లు చర్యలు తీసుకొని జింకను సంరక్షించాలని స్థానికులు కోరారు.

మహిళా సాధికారతలో మైలురాయి.. ఉచిత బస్సు ప్రయాణం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సాధికారత సాధనలో ఉచిత బస్సు ప్రయాణం మైలురాయిగా నిలిచిపోతుందన్నారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఈపూరు మండలం కొచ్చెర్ల వద్ద ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం స్త్రీశక్తి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ప్రయాణ చార్జీల రూపంలో నెలకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ఆదా చేయనున్న స్త్రీశక్తి పథకం రాష్ట్ర చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోతుందని స్పష్టం చేశారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలసి వినుకొండ వరకు బస్సులో ప్రయాణించారు. బస్సులో మహిళలతో ఆయన మాట్లాడారు. ఉచిత ప్రయాణానికి జీరో ఫేర్ కింద మహిళలకు టికెట్లు ఇచ్చారు. అనంతరం వినుకొండ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని, సీఎం చంద్రబాబుకి ప్రతి ఒక్కరూ ధన్యవాదాలు తెలియజేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సగటున రోజుకు 25 లక్షల మంది మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా బస్సు ప్రయాణం చేసే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పథకం ప్రారంభించిన సీఎం చంద్రబాబును ప్రతిపక్ష ఎమ్మెల్యేలైనా అభినందించాలని, కానీ కోడిగుడ్డు మీద ఈకలు పీకాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. విమర్శలు చేస్తున్న వైసీపీ నాయకులు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని, గత ప్రభుత్వంలో 4 సార్లు ఆర్టీసీ ఛార్జీలు పెంచారని, ఎందుకు పెంచారో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

గుంటూరు నుంచి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ కారణంగా ఈ నెల 17, 19 తేదీల్లో గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 02881 భువనేశ్వర్ - యలహంక ప్రత్యేక రైలు 18 ఉదయం 8.35కి గుంటూరు, 9.20కి నరసరావుపేటకు చేరుకుంటుంది. 02882 యలహంక - భువనేశ్వర్ ప్రత్యేక రైలు ఈ నెల 19 సాయంత్రం 4.30కి గుంటూరుకు వస్తుంది.

కాకినాడ టౌన్, చర్లపల్లికి..

వారాంత రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, కాకినాడ టౌన్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీపీఆర్వో తెలిపారు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 22, 29 తేదీల్లో రాత్రి 7.30కి బయలుదేరి రాత్రి 12.05కి గుంటూరు చేరుకుంటుంది. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 17, 24, 31 తేదీల్లో రాత్రి 8.10కి బయలుదేరి రాత్రి దాటాక 1.40కి గుంటూరు, 2.23కి సత్తెనపల్లి స్టేషన్లకు వస్తుంది.


నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను సందర్శించిన డాక్టర్ నోరీ



పెట్ సీటీ స్కాన్‌ను పరిశీలిస్తున్న దత్తాత్రేయుడు

గుంటూరు మెడికల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ వ్యాధుల వైద్య సలహాదారుగా నియమితులైన ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్‌తో కలిసి హాస్పిటల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న పెట్ సిటీ స్కాన్‌ని పరిశీలించారు. ఇన్‌స్టాలేషన్ పనులను సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ఆయనకు వివరించారు. జనరల్ సర్జరీ ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ తదితర క్యాన్సర్ ట్యూమర్ వ్యాధులకు సంబంధించిన అన్ని కేసులకు ప్రభుత్వ సమగ్ర వైద్య శాల నాట్కో సెంటర్‌లోనే సమర్థంగా వైద్యం అందుబాటులో వస్తుందని దత్తాత్రేయుడు తెలిపారు. ఇన్‌పేషెంట్‌గా చేరే కేన్సర్ రోగులకు పెట్ సిటీ స్కాన్‌ని ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలోకి తెచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

14 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



14 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద కొనసాగుతూనే ఉంది. శుక్రవారం 1,44,694 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 14 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 586.90 అడుగులు ఉంది. ఇది 304.98 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,394, 14 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,08,850, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1,44,694 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతలకు 1,36,992 క్యూసెక్కులు..

రెంటచింతల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్ పాండు విద్యుత్ ప్రాజెక్ట్ నుంచి పులిచింతలకు 1,36,992 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈలు సుబ్రహ్మణ్యం, సుబ్బారావు తెలిపారు. రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లను 1.5 మీటర్లు, ఏడు గేట్లను 3.5 మీటర్ల మేర ఎత్తామన్నారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 1,38,496 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.43 మీటర్ల మేర నీరుండగా, 7.046 టీఎంసీలకు సమానమన్నారు. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైందని చెప్పారు.

సంగం డెయిరీ నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ



నూతన ఉత్పత్తులను విడుదల చేస్తున్న చైర్మన్ నరేంద్రకుమార్

ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించడంలో సంగం డెయిరీ ముందడుగు వేసిందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. డెయిరీలో నూతన ఉత్పత్తులను శుక్రవారం ఆవిష్కరించి మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. మైదాలేని బెల్లంతో తయారు చేసిన జోవర్ కాజు కుకీస్, రాగి బాదం కుకీస్, షుగర్ ఫ్రీ రాగి లడ్డు, సున్నుండలను విడుదల చేశారు. వీటిని తీసుకోవడంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా నియంత్రించవచ్చని నరేంద్రకుమార్ తెలిపారు. పాలకవర్గ సభ్యులు, సీఈవో గోపాలకృష్ణ, సీఎఫ్‌వో పెద్ది సాంబశివరావు, సీవోవో పర్వతనేని అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

డెయిరీలో స్వాతంత్ర్య దినోత్సవం

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ ఆవరణలో 79వ స్వాతంత్ర దినోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ వందన సమర్పణ చేశారు. డెయిరి ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు సరఫరా చేయడంలో భాగంగా నెలాఖరున విదేశీ పర్యటనను చెప్పట్టనున్నట్లు చెప్పారు. మిర్యాల గూడలో ఉత్పత్తిని ప్రారంభించామని, దేవరపల్లి, నాయుడు పేటలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డెయిరీ విస్తరణ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. డెయిరీకి వచ్చే లాభాలలోని ప్రతి రూపాయిని పాల ఉత్పత్తిదారులకు, ఉద్యోగులకు పంచడం జరుగుతుందని వివరించారు. సంగం పాలకవర్గం కేవలం డెయిరీకి కాపలాదారులం మాత్రమేనన్నారు. డెయిరీ రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించిన సందర్భంగా ప్రతి ఉద్యోగికి 5 రోజుల వేతనాన్ని బోనస్‌గా ఇవ్వడానికి పాలక వర్గం అమోదం తెలిపిందన్నారు. సుదీర్ఘకాలం డెయిరీ అభివృద్ధిలో భాగస్వాములైన అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను, వారి అర్హతలను బట్టి అసైన్మెంట్ ఉద్యోగులుగా దాదాపు ఇప్పటివరకు 517 మందికి పదోన్నతులు కల్పించామని వివరించారు. పాల ఉత్పత్తి దారులకు ఒక కొత్త ఫార్మర్స్ యాప్‌ని అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని చైర్మన్ నరేంద్ర కుమార్ తెలిపారు. పాలక వర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశం ఆనందించిన రోజు: జడ్పీ సీఈఓ



మాట్లాడుతున్న సీఈఓ జ్యోతి బసు

గుంటూరు సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): బానిస సంకెళ్లతో అల్లాడిపోయిన భారత దేశం ఆనందించిన రోజు ఆగస్టు 15 అని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం జరిగింది. జడ్పీ వైస్ చైర్మన్లు బత్తుల అనురాధ, నర్సిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అవార్డులు పొందిన 20 మంది జడ్పీ సిబ్బందిని సీఈఓ, డెప్యూటీ సీఈఓ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో పీడీ వి.శంకర్ జెండా వందనం గావించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో పీడీ తలారి వెంకట విజయలక్ష్మి జెండాను ఆవిష్కరించారు.

30 వరకు బీఎస్సీ (హన్స్) ప్రవేశ గడువు

లాంఫాం(తాడికొండ)ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి బీఎస్సీ(హన్స్) కమ్యూనిటీ సైన్సు ఎన్.ఆర్.ఐ కోటాలో, బీఎస్సీ(హన్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 30వ వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.

పులివెందులలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు పరచి చూపాం

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేతలు పల్నాడులో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తామన్నారని..కానీ, కూటమి ప్రభుత్వం పులివెందులలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు పరచి చూపిందన్నారు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు. 30 సంవత్సరాల తర్వాత పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. శుక్రవారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో హత్యలు, తప్పుడు కేసులు, దాడులు, అరాచకాలు రాజ్యమేలాలయన్నారు. ఓడి పోయిన నేతలు ఆత్మ పరిశీలన చేసుకుంటారని కానీ, వైసీపీ నేతలు మాత్రం ఎన్నికల ముందు ఏ విధంగా ఐతే నోరు పారేసుకున్నారో ఎన్నికల తర్వాత కూడా అదే విధానంలో నడవటం వారికి ఎంత మాత్రం కూడా నైతిక విలువలు లేవని తెలుస్తుందన్నారు. వై నాట్ 175, వై నాట్ కుప్పం అన్నారని.. తాము వై నాట్ పులివెందుల అన్నాం, నెరవేర్చామన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే... రప్పా.రప్పా నరుకుతామన్నారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గుంతలతో ఉన్న రహదారులను అభివృద్ధి పరిచామని, అన్న క్యాంటీన్‌లు, తల్లికి వందనం , అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సులను నడుపుతున్నామని వివరించారు. పులివెందులలో ఎన్నికలపై నోరు పారేసుకుంటున్న వైసీపీ నేతలు.. గురజాల నియోజక వర్గంలో జడ్పీటీసీలు, ఎంపీపీ, ఎంపీటీసీలు, మునిసిపల్ చైర్మన్‌లు ఏకగ్రీవం చేసుకున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అప్పుడు వైసీపీ నేతలు ఏం చేశారో ప్రజలు గుర్తించారని, తగిన బుద్ధి చెప్పారన్నారు. నిన్న కాక మొన్న దాచేపల్లి హాస్టల్‌లో గొడవ జరిగితే దాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారు, తప్పుడు ఆలోచనలు, తప్పుడు బుద్ధులు ఉన్న వైసీపీ నేతలకు అంతకన్నా మంచి ఆలోచనలు ఏం వస్తాయంటూ ఎద్దేవా చేశారు. శ్రీనగర్ గ్రామంలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థికి తాము.. ఏటా రూ.50వేలు విద్యార్థి చదువుకు సహాయం అందిస్తున్నాం. మీరు ఏనాడైనా ఇలాంటి అభివృద్ధి పనుల చేశారా? అంటూ ప్రశ్నించారు. జగన్‌రెడ్డి చంద్రబాబు నాయుడు వయస్సు గురించి మాట్లాడుతున్నారని, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు కూడా ఆ వయస్సులో ఉన్న వారు పదవులు చేస్తున్నారు, రాజశేఖరరెడ్డి బతికుంటే ఇదే వయస్సు ఉండేది కదా? ఇలాంటి తప్పుడు మాటలు మాట్లాడటం వైసీపీ నేతలకు చెల్లిందన్నారు. చంద్రబాబు నాయుడుకు ప్రధానమంత్రి పదవి అవకాశం వచ్చినా రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆయన ఆ పదవి జోలికి వెళ్ల లేదని వివరించారు.



టైలరింగ్ షాపును ప్రారంభించి దుస్తులను కుడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

బడుగు బలహీన వర్గాలకు దుకాణాలు

నారాయణపురంలోని బంగ్లా సెంటర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు షాపుల నిర్మాణానికి స్థలాలను మంజూరు చేయడంతో పాటు నూతన షాపులను ప్రారంభించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే యరపతినేని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పులుకూరి కాంతారావు, తంగెళ్ళ శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, నర్ర పుల్లయ్య, వినోద్‌రెడ్డి, తిరుమల కుమార్, బాలయ్య, సొసైటీ నారాయణ, నెల్లూరి రామ కోటయ్య, చింతపల్లి హసాన్ అహమ్మద్, తోట వెంకటేశ్వర్లు, పగడాల భాస్కరరావు, రుద్రాల అచ్చారావు, మునగ నిమ్మయ్య, కొప్పుల గిరి, బొమ్మిరెడ్డి సత్యం, ఐనాల శ్రీరాములు, కూరాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంగం జాగర్లమూడి సర్పంచ్‌కి..

రెండవసారి అరుదైన గౌరవం



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి

తెనాలి రూరల్, ఆగస్టు15(ఆంధ్ర జ్యోతి): మండలంలోని సంగం జాగర్లమూడి సర్పంచ్ పాలడుగు జయ నాగలక్ష్మికి రెండసారి ఢిల్లీలో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అరుదైన గౌరవం దక్కింది. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, డ్రెయిన్ల నిర్మాణం, శ్మశాన వాటిక ఆధునీకరణ, దోబీ ఘాట్ల నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టి స్వచ్ఛ గ్రామం వైపు తీర్చిదిద్దేలా కృషి చేసింది. గత ఏడాది సైతం ఆమె సేవలను గుర్తించి ఢిల్లీలో ప్రసంసా పత్రం అందించారు. ఈ ఏడాది కూడా అందుకోవడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సర్పంచ్‌కి అభినందనలు తెలిపారు.

గురజాల ఆర్డీవో మురళీకృష్ణకు అవార్డు

గురజాలటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గురజాల ఆర్డీవో మురళీకృష్ణ ఉత్తమ అధికారి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం నరసరావుపేటలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న ఆర్డీవో మురళీకృష్ణ

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

రైల్ విహార్‌లో.. స్వాతంత్ర్య వేడుకలు

గుంటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నల్లపాడులోని రైల్ విహార్‌లో స్వాతంత్ర్య దినోత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఉదయం డీఆర్ఎం సుధేష్ణ సేన్ జాతీయ జెండాని ఎగురవేసి ఆర్‌పీఎఫ్ పరేడ్‌ని ఓపెన్ టాప్ వాహనంలో సందర్శించారు.

రెంటచింతలలో చోరీ

● 48 గ్రాముల బంగారం, రూ. 65 వేల నగదు అపహరణ



చెల్లాచెదురుగా ఉన్న బీరువా

రెంటచింతల, ఆగస్టు 15 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని ఓ పాఠశాల సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఉదయం 10 గంటలకు చోరీ జరిగింది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున, బాధితుడి వివరాల మేరకు.. నారాయణ పురం శ్రీనివాసరావు రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం 9 గంటల వరకు రేషన్ లెక్కలు చూసుకొని టైలరింగ్ పనికి వెళ్లాడు. 11 గంటలకు ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులకొట్టి ఉన్నాయి. ఇంటిలో ఉంచిన తాళాలను తీసుకొని బీరువా తలుపులు తెరిచి 48 గ్రాముల రెండు జతల చెవిజోళ్లు, రెండు ఉంగరాళ్లు, రెండు తాళిబొట్లు, పది తులాలుండే వెండి పట్టీలు, రూ. 65 వేల నగదును అపహరించుకుపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెంటచింతల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే 2020 జనవరి 28వ తేదీన ఈ ఇంటికి ఎదురుగా ఉండే మెడికల్ షాపు కోటిరెడ్డి ఇంట్లో చోరీ జరగగా రూ. 3 లక్షల నగదు, పది సవర్ల బంగారం, ఐదు తులాల వెండి అపహరణకు గురైంది. ఈ కేసును నేటికీ ఛేదించలేదు. ఈ నెల 4న మాస్టర్ జనార్దన్ ఇంట్లో చోరీ జరిగింది. ఇప్పుడు మరో దొంగతనం జరగడం స్థానికులను కలవర పాటుకు గురి చేస్తోంది.

యువకుడిపై కత్తితో దాడి

వినుకొండటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణం వెన్నపూస కాలనీకి చెందిన గనుపు నాగమయ్య అనే యువకుడిపై అదే ప్రాంతానికి చెందిన పిడతల సుధాకర్ అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో బంధువులందరూ కలిసి మాట్లాడుతూ ఉండగా సుధాకర్ కత్తితో దాడికి తెగబడి అడ్డు వచ్చిన నాగమయ్యను పొడిచాడు. రక్తస్రావమై కుప్ప కూలిపోయిన అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైసీపీ నాయకులు పిడతల సుధాకర్, బాజీ, చిన్నబాబు, వెంకటరత్నం, దేవదాసు ప్రోద్బలంతో సుధాకర్ కత్తితో హత్యాయత్నం చేశాడని, దీనిపై వినుకొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడి అన్న గనుపు కోటేశ్వరావు తెలిపారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో బాధితుడు చికిత్స పొందుతున్నాడు.

గంజాయి విక్రయ ముఠా గుట్టు రట్టు



వివరాలు తెలుపుతున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ హనుమంతరావు, సీఐ

నాదెండ్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గంజాయిని రవాణా చేస్తూ గణపవరం, చిలక లూరిపేట ప్రాం తాల్లో విక్రయాలు జరుపుతున్న గంజాయి ముఠా సభ్యులను శుక్రవారం చిలకలూరిపేట రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.44 లక్షల విలువైన గంజాయితో పాటు 117 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వివరాలను ఇన్‌చార్జ్ డీఎస్పీ హనుమంతరావు, రూరల్ సీఐ సుబ్బ నాయుడు విలేకరులకు వివరించారు. గణపవరంలో పలువురికి గంజాయి అమ్ముతున్నట్టుగా సమాచారం అందడంతో పోలీసులు నిఘా పెట్టారు. గణపవరం గ్రామ పరిధిలోని ప్రసన్న వంశీ కృష్ణ స్పిన్నింగ్ మిల్లు వద్ద గంజాయిని అమ్ముతున్న ముఠా సభ్యులపై నాదెండ్ల పోలీసులు దాడులు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు అన్నంరాజు ఈశ్వర సాయి, నేలపాటి ఠాకూర్, షేక్ హుస్సేన్ బాషా, షేక్ బాజీ, హుస్సేన్ బాషా, షేక్ బాజీ, పల్లపు నాగలును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద గంజాయి కొని సేవిస్తున్న మరో పది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కిలోల 440 గ్రాముల గంజాయి, రూ.3,500 నగదు, సెల్ ఫోన్, 117 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన సీఐ సుబ్బ నాయుడు, ఎస్ఐ పుల్లారావులతో ఏఎస్ఐలు రోసిబాబు, పీవీ సుబ్బారావు, పి.రమేష్, కానిస్టేబుళ్ల దేవరాజు, శ్రీధర్, ప్రసాదు తదితరులను ఎస్పీ కె.శ్రీనివాసరావు అభినందించారని డీఎస్పీ తెలిపారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

రేపల్లె నియోజకవర్గంలో వేడుకలు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల

రేపల్లె, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య వేడుకలను నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలలో, పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ పతాకాన్ని సీనియర్ సివిల్ జడ్జి జస్టిస్ ఎస్‌పీడీ వెన్నెల ఆవిష్కరించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జస్టిస్ వి.దివ్యసాయిశ్రీవాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గరికపాటి వెంకటగిరిధర్, కార్యదర్శి ఉప్పాల శ్రీనివాసరావు, న్యాయవాదులు కేసన రామస్వామి, యరగళ్ళ ధర్మతేజ, ఆళ్ళ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న అనగాని శివప్రసాద్, టీడీపీ నాయకులు

● రేపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం ప్రాణాలు అర్పించిన మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, మేకా రామకృష్ణ, ఆలపాటి వేణుగోపాల్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, గోగినేని శ్రీనివాసరావు, కారుమూరు జ్యోతి, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

● స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రామలక్ష్మి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని పట్టణాధ్యక్షుడు అన్నం సాయివరప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి.వెంకటేశ్వరరావు, వి.శివరాంప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.సాంబశివరావు, కిషోర్‌బాబు, శివనాగేంద్రం, వెంకటేశ్వరరావు, కనికిచర్ల లక్ష్మీప్రసాద్, మట్టుపల్లి సుబ్బారావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

● స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కట్టా మంగ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, స్థానిక పోలీస్‌స్టేషన్లో పట్టణ సీఐ మల్లికార్జునరావు జెండాను ఆవిష్కరించి మిఠాయిలను పంపిణీ చేశారు.

● రేపల్లె మండలం పిరాట్లంకలో కమతం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు కమతం సాంబశివరావు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కమతం రమాదేవి, తోట శివన్నారాయణ, బి.వీరరాఘవయ్య, చినవెంకటేశ్వర్లు, కమతం బ్రహ్మారావు, కందుల బ్రహ్మచింతారావు, కమతం వెంకటేశ్వరరావు, బి.భాస్కరరావు, ఎన్.శివపార్వతి, కె.శ్రీనివాసరావు, బావిరెడ్డి వెంకయ్య, అంబటి శ్యామ్‌సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సిహెచ్ పద్మావతి, పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ శ్రీనివాసరావు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ రాజేందర్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మత్తి దివాకరరత్నప్రసాద్, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో నవీన్‌కుమార్ జాతీయజెండా ఎగురవేశారు.

● నగరం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : నగరం మండలంలో స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరం పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాంచారయ్య, ఎస్వీఆర్ఎం కళాశాల, ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ సీఐ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

● కొల్లూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొల్లూరులోని రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ విజయలక్ష్మి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ అమరవర్ధన్, టీడీపీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాలతో పాటు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో సర్పంచ్‌లు జాతీయ జెండా ఆవిష్కరించారు.



జాతీయ జెండా ఎగురవేస్తున్న చైర్‌పర్సన్ పూర్ణకుమారి

● వేమూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు వ్యాపార సంస్థలు, నివాస గృహాలపై దేశభక్తిని చాటుకుంటూ ప్రతి ఒక్కరూ మూడు రంగుల జెండాలను ఎగురవేశారు. వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సుశీల, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మోహనరావు, ప్రభుత్వ వైద్యశాల వద్ద సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా ఫర్వీన్, ప్రభుత్వ కళాశాల వద్ద ప్రిన్సిపల్ గాయత్రి మువ్వన్నెల జెండాను ఎగుర వేశారు. వేమూరు, వరహాపురం, పెరవలి, వ్యవసాయ సహకార పరపతి సంఘాల వద్ద చైర్మన్లు ఊసా రాజేష్, బొల్లిముంత నాగకుమార్, ఉక్కుర్తి నాగయ్య జెండాలను ఎగురవేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, బ్యాంకులు వివిధ సంస్థల వద్ద జెండా ఎగురవేశారు. పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య వేడుకలను ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లలితకుమారి, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దారా కిరణ్మయి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శివయ్య, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు గ్రామ సచివాలయాల్లో సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈవో దేవదాసు పాల్గొన్నారు.

కలెక్టర్ బంగ్లాలో ఎట్ హోమ్ కార్యక్రమం



ఎట్‌హోమ్ కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలలో భాగంగా శుక్రవారం రాత్రి కలెక్టర్ బంగ్లాలో ఎట్‌హోమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.మాలకొండయ్య, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబ సభ్యులకు సన్మానం



అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించి పండ్లు అందజేస్తున్న మంత్రి రవికుమార్, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య వేడుకలలో భాగంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబ సభ్యులను రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు కలిసి ఘనంగా సన్మానించి పండ్లు అందజేశారు. యుద్ధంలో మృతి చెందిన జశ్వంత్‌రెడ్డి తల్లిదండ్రులు మరుప్రోలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా యారం అన్నమ్మ, పింగళి వెంకయ్య కుటుంబ సభ్యులైన పింగళి రమాదేవిలను సత్కరించి బహుమతులు అందజేశారు. సైన్యంలో అశువులు బాసిన జవాన్‌ల కుటుంబ సభ్యులైన షర్మిలబేగం, షేక్ అక్తరున్నీసా, సింగంశెట్టి నాగసుజాత, రబీయా బీబీలకు నివేశన స్థలాల పట్టాలను మంత్రి, కలెక్టర్ చేతులమీదగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.మాలకొండయ్య, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ప్రాణ త్యాగఫలితమే స్వాతంత్ర్యం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



స్వాతంత్ర్య వేడుకలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల ప్రాణత్యాగఫలితంగానే స్వాతంత్ర్యం లభించిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయం, తెలుగుదేశం పార్టీ కార్యాలయం, మాజీ సైనిక సంక్షేమసంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగేశన జాతీయ జెండాలు ఎగురవేసి గౌరవవందనం చేశారు. ఆయా ప్రాంతాలలో జరిగిన సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, స్వేచ్ఛను కాపాడుకోవటం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, విన్నకోట వీరయ్యనాయుడు, మందపాటి ఆంద్రేయ, కూచిపూడి శ్యామ్‌సుందర్, పల్లం సరోజినీ, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో...



కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి తదితరులు

బాపట్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల ప్రాణత్యాగాలు, పోరాట బలిదానంతోనే స్వాతంత్ర్యఫలాలు అందుకున్నామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. స్వాతంత్ర్య వేడుకలలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది త్యాగులచేత, ప్రాణాలర్పించటం ద్వారా, వారు సర్వస్వాన్ని కోల్పోవటం ద్వారా ఒక వలస సామ్రాజ్య వాద ప్రభుత్వం చేతి నుండి మనం స్వాతంత్ర్యాన్ని పొందామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి మల్లికార్జునరావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో...



పోలీసు కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ తుషార్ డూడి జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణాలు అర్పించి మనకు స్వేచ్ఛను అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏవో బి.శ్రీనివాసరావు, సీసీఎస్ డీఎస్పీ పి.విజయసారథి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఆర్ఐలు షేక్ మౌలుద్దీన్, టి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్యాంబాబు, ఇతర న్యాయమూర్తులు

● నిరుపేదలకు సత్వర న్యాయం చేయటమే నిజమైన స్వాతంత్ర్య లక్ష్యమని జిల్లా జడ్జి కె.శ్యాంబాబు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జడ్జి శ్యాంబాబు జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల పటాలకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.పవన్‌కుమార్, రిటైర్డ్ జిల్లా జడ్జి ఎన్.రమేష్, ఏజిపి శ్యామలాదేవి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గవిని శ్రీనివాసరావు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కె.లక్ష్మీనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల అవినాష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

● పట్టణంలోని పటేల్‌నగర్ జనసేనపార్టీ కార్యాలయంలో జనసేన నాయకుడు, అఖండఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, మాజీ ఎమ్మెల్సీ సతీష్ ప్రభాకర్

● భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు, మాజీ ఎమ్మెల్సీ బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించి అక్కడ జరిగిన సమావేశంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి జాతీయ జెండాను ఎగురవేసి జాతినేతలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. వివిధ పోటీలలోని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి డాక్టర్ జి.వినయ్‌కుమార్, డాక్టర్ ఎం.శ్రీరేఖ, డాక్టర్ పులిమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

● డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్‌డీన్ డాక్టర్ డిడి స్మిత్ సిబ్బందితో కలిసి జాతీయజెండాను ఎగురవేసి గౌరవవందనం చేశారు. అదేవిధంగా డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్రసాంకేతిక కళాశాలలో నిర్వహించిన వేడుకలలో అసోసియేట్‌డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

● మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, మహిళా సమైక్య ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ డాక్టర్ బి.శరత్‌బోస్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పంగులూరి హరిప్రసాద్, మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేస్తున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు

● బాపట్ల రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం మండలంలో...

పిట్టలవానిపాలెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా స్వాతం త్ర్య వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో, పాఠశాలల్లో ఘనంగా నిర్వహిం చారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు, తహసీల్దార్ కార్యాలయంలో డి.వెంకటేశ్వరరావు, చందోలు పోలీసుస్టేషన్‌లో ట్రైనీ పి.ఎస్ఐ రాజ్యలక్ష్మి సిబ్బందితో జెండాలను ఎగురవేశారు. చందోలు నీలిబంగారయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ షేక్ అన్వర్ జాతీయ జెండా ఎగురవేశారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఖాజీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి దేవస్థానంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు.



జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎండి అఫ్జల్, డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి తదితరులు

● స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటిల సంయుక్త ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కనుమూరి సాంబమూర్తిరాజు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్టు సాయిబాబారెడ్డి, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖాశీం, ఎం.గంగరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మంతెన గంగరాజు, లక్కంరాజు ఆదిలక్ష్మి, షేక్ సలీం, మండల బీజేపీ మాజీ అధ్యక్షులు పరిమి రామకృష్ణ సాయిబాబు, మండల జనసేన అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్‌బేగ్ పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ అండ్ ఎంకెఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గం ఉపాధ్యక్షుడు మంతెన శివరామరాజు, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, జాయింట్ సెక్రటరీ మంతెన కృష్ణంరాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో...

కర్లపాలెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని పలుప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ఫ్యాక్టరీలలో, పాఠశాలల్లో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా జరిపారు. మండలంలోని దమ్మనవారిపాలెంలో ఉన్న సతీష్‌ఫుడ్ పార్క్‌లో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవవందనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు బంగారుబాబు, యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కొండారెడ్డి అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షాకీర్ పాషా, స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ మండలాధ్యక్షులు ఏపూరి భూపతిరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కర్లపాలెం యాక్షన్ టవర్ హైదరాబాద్ వలి ఆధ్వర్యంలో కర్లపాలెం ఐలెండ్ సెంటర్ వరకు తిరంగ ర్యాలీ నిర్వహించారు. యాజలి సెంటర్‌లో విజన్ ఫర్‌బెటర్ సొసైటీ అధ్యక్షులు ఎం.వోభద్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రిక్షా కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు.



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న హైవెండ్ హైస్కూల్ చిన్నారులు, ఉపాధ్యాయులు

● కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్‌లో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కౌట్ విద్యార్థులు కర్లపాలెం పురవీధులలో జాతీయ జెండాలు చేతబూని తిరంగ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు నందిని, అక్షయ్‌లు చేసిన పలు గీతాలకు చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. పలు పోటీలలో విజేతలకు మెమోంటోలను, సర్టిఫికెట్లను చైర్మన్ ఉదయచంద్రరావు, ఎండీ సాయిమహేంద్రబాబు, డైరెక్టర్ ఆంజనేయప్రసాద్, చాందినీ అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఫీ, షర్మిల, ఫరీదా, దివ్య, రజియా, వినిత, అనూష, సుమలత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

బాపట్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో కలెక్టర్ జె.వెంకటమురళి అధ్యక్షతన నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరింప చేశాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్దఎత్తున నిర్వహించిన ఈప్రదర్శనలను రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య, ఎస్పీ తుషార్‌డూడి వీక్షించి విద్యార్థులను అభినందించారు. జాతీయత, సంస్కృతులను చాటుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆలోచింప చేశాయి.



సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఫ్యాకల్టీగా లలిత

బాపట్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రంలో పనిచేస్తున్న సీనియర్ ఫ్యాకల్టీ కె.లలితకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫ్యాకల్టీ అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ విజయవాడ కమిషనర్ ముత్యాలరాజు చేతుల మీదగా అవార్డు, ప్రశంసపత్రాన్ని అందజేసి అభినందించారు. ఈటీసీ ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు, ఇతర సిబ్బంది ఆమెను అభినందించారు.

ఉత్తమ గ్రంథాలయ అధికారి...

కొల్లూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో కొల్లూరు మండలంలోని అనంతవరం శాఖ గ్రంథాలయం అధికారిగా విధులు నిర్వహిస్తున్న కనకదుర్గ ఉత్తమ శాఖా గ్రంథాలయ అధికారిగా పురస్కారం అందుకున్నారు.

ఎస్‌బీఐ సిబ్బందికి సత్కారం

కొల్లూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సిబ్బంది ఖాతాదారులకు అందిస్తున్న సేవలకు విశ్రాంత ఉద్యోగులు వారిని సత్కరించారు. కొల్లూరులోని ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాసరావుతో పాటు పలువురు సిబ్బందిని రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ మేడికొండ అనీల్‌కుమార్, విశ్రాంత ఉద్యోగులు, బీజేపీ నాయకుడు గొగినేని చంద్రశేఖర్ దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు.



కొల్లూరులో ఉచిత బస్సు ప్రయాణ పథకం గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

స్త్రీ శక్తి పథకంతో రాష్ట్రమంతా మహిళలకు ఉచిత ప్రయాణం

● ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, భట్టిప్రోలు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తి పథకంతో రాష్ట్రమంతా మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం వేమూరులో ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించి మహిళలతో పాటు కొల్లూరు చేరుకున్న ఎమ్మెల్యేకు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తుందన్నారు. అనంతరం బస్సులో మహిళలతో పాటు దోనేపూడి మీదుగా వెల్లటూరు బస్టాండ్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రభుత్వం అమలు చేసిన సూపర్‌సిక్స్ హామీలు, మహిళా సాధికారత గురించి ప్రసంగించారు ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, నియోజకవర్గ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, మండల పార్టీ అధ్యక్షులు వాకా శేషుబాబు, మోటూరి పుణ్య శ్రీనివాసరావు, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వేమూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబు నాయుడు పాలన ద్వారానే రాష్ట్రంలోని మహిళలకు సముచితమైన న్యాయం చేకూరుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరులో స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని శుక్రవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించి ఆయన ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. వేమూరు బస్టాండ్ సెంటర్‌లో ఆయన మహిళలతో మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. ఉచిత టిక్కెట్ మహిళ కండక్టర్ ద్వారా తీసుకుని తొలిగా ప్రారంభమైన బస్సు ప్రయాణంలో పాల్గొన్న మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, వేమూరు ఏఎంసీ చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి మహిళా నాయకులు గవిని లక్ష్మీదుర్గ, ఘంటా రమాదేవి, స్వాతి, మైనారిటీ సెల్ నాయకులు షేక్ హనీఫ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వేల్పుల రవి, ఎస్సీ సెల్ నాయకులు జయప్రకాష్, సుధాకర్, మండల పరిధిలోని గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో మహిళలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ఉచిత బస్సును ప్రారంభిస్తున్న శివప్రసాద్, ఆర్డీవో రామలక్ష్మి

● రేపల్లె, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణాన్ని స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్డీవో రామలక్ష్మి, మంత్రి సోదరుడు శివప్రసాద్, ఆర్టీసీ డీఎం సునిల్ కుమార్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సూపర్‌సిక్స్‌లో భాగంగా స్త్రీశక్తి పథకం అమలు చేయటంతో మహిళలకు ఎంతోమేలు జరుగుతుందన్నారు. ఆర్డీవో రామలక్ష్మి మహిళలకు ఈపథకం ఎంతో మేలు జరుగుతుందన్నారు. డిపో మేనేజర్ సునిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఆధార్‌కార్డుతో బస్సు ఎక్కి జీరో టికెట్‌ను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, కమిషనర్ కె.సాంబశివరావు, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మత్తి భాస్కరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, పంతగాని ప్రేమలత, కారుమూరు జ్యోతి, రామలక్ష్మి, యలవర్తిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.3,26,416ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. కోళ్లపాలెం గ్రామానికి చెందిన కనపర్తి శాంతకుమారి రూ.1,35,000లు, డొక్కు వనకుమారి రూ.41,136, నీలా పెదవెంకటేశ్వరరావు రూ.36,843, కుంచా బుజ్జి రూ.35 వేలు, నీలా చినదర్మారావు రూ.18 వేలు, వరికూటివారిపాలెంకు చెందిన ప్రకాశరావు, రూ.50,437, ఓలేరుకి చెందిన దాసే విష్ణువర్ధనరావు రూ.15 వేలు మొత్తం రూ.3,26,416 చెక్కులను గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయా కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ సేవలందించిన అధికారులకు సేవాపురస్కారాలు

బాపట్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఉత్తమసేవలు అందించిన అధికారులకు సేవా పురస్కారాలను అందజేశారు. రాష్ట్ర విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి చేతులమీదగా పురస్కారాలను అందజేశారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారిణి జె.రాజాదెబోరా తదితరులకు పురస్కారాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య పాల్గొన్నారు.



ఉత్తమ సేవా పురస్కారాన్ని మంత్రి రవికుమార్, కలెక్టర్ జె.వెంకటమురళి నుంచి అందుకుంటున్న ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్ ఆర్డీవోలు పి.గ్లోరియా (బాపట్ల), రామలక్ష్మి (రేపల్లె), బాపట్ల కమిషనర్ జి.రఘునాథరెడ్డి

పోలీసు అధికారులకు...

స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని ఉత్తమసేవలదించిన పోలీసు అధికారులకు పురస్కారాలు పంపిణీ చేశారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి చేతులమీదగా పురస్కారాలు అందించి అభినందించారు. పట్టణ సీఐ ఆర్.రాంబాబు, రూరల్ సీఐ శ్రీనివాసరావు, తాలూకా సీఐ హరికృష్ణ, ఎస్సీ సీఐ నారాయణ, పీజీఆర్ఎస్ సెల్ సీఐ యు.శ్రీనివాసరావు, మహిళా పీఎస్ సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ ఆర్.అహ్మద్ జానీ, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఏఆర్‌డీఎస్పీ పి.విజయసారధి తదితరులకు పురస్కారాలు అందజేసి వారి సేవలను కొనియాడారు. ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.మాలకొండయ్య పాల్గొన్నారు.

నలుగురు అధికారులకు...

కర్లపాలెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వివిధ శాఖలలో పనిచేస్తున్న నలుగురు అధికారులు స్వాతంత్ర్య వేడుకలు సందర్భంగా కలెక్టర్ జె.వెంకటమురళి, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఎస్పీ తుషార్ డూడి చేతులమీదగా ఉత్తమ అవార్డులు అందుకున్నారు. కర్లపాలెం పంచాయతీ కార్యదర్శి సునీత, మండలపరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రజనీ, కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర, పేరలి ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ సిద్ధార్థ ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్నారు. వీరిని మండలంలోని పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

అవీ.. ఇవీ..

అగ్రస్థానం దిశగా.. అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

సమీకృత ఆక్వా పార్కు పనులు జరుగుతున్నాయన్నారు. పనులను సత్వరం పూర్తి చేసి త్వరలోనే రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులకు వేట నిషేధ భృతిని పెంచి అందించామన్నారు. శుక్రవారం నుంచి అమలు చేయబోయే స్త్రీశక్తి పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా రోజుకు దాదాపు 50,000 మంది మహిళలు ఉచిత ప్రయాణ లబ్ధి చేకూరనున్నదన్నారు. పీ4 పథకం ద్వారా ఏళ్ల తరబడి పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలకు బంగారు కుటుంబాల జాబితాలో చేర్చి మార్గదర్శకుల ద్వారా ఊతమిచ్చే చర్యలకు శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, కొండయ్య, ఏపీ చేనేత కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత, ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

మైక్రో ఆర్ట్ ప్రత్యేక ఆకర్షణ..

చీరాలకు చెందిన మహిత మైక్రో ఆర్ట్ ప్రతిభతో 65 పెన్సిళ్లపై డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్ర, 86 పెన్సిళ్లపై నెల్సన్ మండేలా, 73 పెన్సిళ్లపై మహాత్మగాంధీ, 25 పెన్సిళ్లపై డొక్కా సీతమ్మ జీవిత చరిత్రను లిఖించింది. వీటితో పాటు 800 పెన్సిళ్లపై భగవద్గీతలోని 700 శ్లోకాలు లిఖించడం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

కుమారుని చెంతకు తప్పిపోయిన తల్లి



బిహార్ నుంచి వచ్చిన కుమారుడికి తల్లిని అప్పగిస్తున్న ఎస్సై హరిబాబు

చీరాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడో బీహార్ నుంచి ఇక్కడకు వచ్చి ఎటువెళ్లాలో తెలియని ఓ వృద్ధురాలు శక్తి టీం చొరవతో చివరకు కుమారుడిని కలిసింది. బీహార్ నుంచి వచ్చిన ఆమె కుమారుడు శుక్రవారం వచ్చి ఆమెను తీసుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన రామ్‌కుమార్‌దేవీ కుటుంబంలో చిన్నపాటి మనస్పర్థతో ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఎటువెళ్లాలో, తిరిగి స్వగ్రామం బీహార్ ఎలా వెళ్లాలో తెలీయక కనిపించిన రైలు ఎక్కింది. యాచన చేస్తూ జీవనం వెళ్లదీసింది. ఇలా కొంతకాలం తిరిగి చివరకు చీరాలకు చేరింది. ఇక్కడే గత పదిహేను రోజులుగా ఉంటోంది. . ఈ నేపథ్యంలోనే చీరాల్లో సంచరిస్తున్న దేవీని శక్తి టీం ఎస్సై హరిబాబు పరామర్శించారు. ఆమెతో భాష తెలిసిన ఇక్కడి కూలీల సహాయంతో ఆమె కుమారుడి వివరాలు తీసుకొని, ఫోన్‌లో ఆమెకుమారుడు అనిల్‌సింగ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన శుక్రవారం ఇక్కడకు చేరుకొని పోలీసులు ద్వారా తల్లిని కలుసుకున్నాడు. ఒక్కసారిగా తల్లిని చూసి బోరున విలపించి హత్తుకున్నాడు. తల్లి జాడను తెలిపిన పోలీసులకు చేతులు జోడించి నమస్కరించారు. అనంతరం బీహార్‌కు తల్లిని తీసుకు వెళ్లడంతో కథ సుఖాంతమైంది. వృద్ధురాలిని ఇంటికి చేర్చేలా కృషి చేసిన శక్తి టీంను పలువురు అభినందించారు.



మార్టూరులో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు





వేటపాలెం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన, పర్చూరులో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న న్యాయాధికారులు

మువ్వన్నెల రెపరెపలు

స్వాతంత్ర్య వేడుకలను చీరాల, పర్చూరు, అద్దంకి నియోజక వర్గాలలో ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయాలు, వారివారి కార్యాలయాల వద్ద జెండాలు ఎగురవేశారు. ఇక విద్యాసంస్థలపై, న్యాయస్థానాలు, పోలీసుస్టేషన్లు, తహసీల్దార్ కార్యాలయాలపై మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. చీరాల, పర్చూరు, అద్దంకి



అద్దంకిలో జెండా ఆవిష్కరిస్తున్న న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి



బల్లికురవలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న గ్రానైట్ క్వారీల యజమానులు



చీరాలలో కవాతు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ మహోత్సవాలు

పంగులూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పంగులూరులోని చిలుకూరివారి వంశదేవర శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 17న ప్రతిష్ఠ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన, దీక్షా ధారణ, పతాకావిష్కరణ చేశారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. బ్రహ్మశ్రీ వేములశ్రీహరిచౌదరి నేతృత్వంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు చిలుకూరి వంశస్థులు సతీసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు.

రాజ్యలక్ష్మీ అమ్మవారి వ్రతాలు

చినగంజాం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) : స్థానిక భూసమేత భావనారాయణ స్వామి దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సామూహిక రాజ్యలక్ష్మీ అమ్మవారి వ్రతాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భావనారాయణస్వామి దేవస్థానంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారికి విశేష పంచామృత స్నపన తిరువంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి మోహన లక్ష్మీనరసింహాచార్యులు పూజా క్రతువు నిర్వహించారు.



మంత్రి రవికుమార్ చేతులమీదుగా అవార్డులు అందుకుంటున్న రూరల్ సీఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్సైలు జనార్ధన్, రాజ్యలక్ష్మి, ఏఎస్సై సత్యనారాయణ, డీఎస్పీ మొయిన్ సీఐ సుబ్బారావు, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఉత్తమ సేవలకు అవార్డులు

చీరాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వెంకట మురళీ, ఎస్పీ తుషార్ డూడీ, ఎమ్మెల్యే కొండయ్య చేతుల మీదుగా అవార్డులు దక్కాయి. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు సందర్భంగా బాపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ ఎండీ మొయిన్, సీఐలు సుబ్బారావు, శేషగిరిరావు, ఎస్సైలు జనార్ధన్, రాజ్యలక్ష్మీ, ఏఎస్సై సత్యనారాయణ అందుకున్నారు. అలాగే మంగళగిరిలో కమీషనరేట్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరక్టర్ నిశాంత్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ రాహుల్‌దేవ్ శర్మ, అడిషనల్ కమిషనర్ దేవకుమార్ చేతుల మీదుగా ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, మెప్మా మేనేజర్ కొండయ్య అవార్డులు అందుకున్నారు.



మంగళగిరిలో ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు



ప్రశంసాపత్రం అందుకుంటున్న చినగంజాం ఎస్సై రమేష్

చినగంజాం : మండలంలోని చినగంజాం పోలీసుస్టేషన్ ఎస్.ఐ శీలం రమేష్, ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, 104 డీఈవో పొదిలి రాఘవలు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. వీరికి ఆయా శాఖల సిబ్బంది అభినందనలు తెలిపారు.

యద్దనపూడి,(మార్టూరు): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా శుక్రవారం బాపట్లలో జరిగిన కార్యక్రమంలో యద్దనపూడి స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు గోరంట్ల శ్రీనివాసరావు, శ్యాంప్రసాద్‌లు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరిద్దని ఎస్ఐ టి రత్నకుమారి తోపాటు సహచర ఉద్యోగులు అభినందించారు.

మార్టూరు : మండల తహసీల్దార్ టి.ప్రశాంతి శుక్రవారం బాపట్లలో ఉత్తమసేవలకు గాను ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆయనున్న సిబ్బంది అభినందించారు.

మార్టూరు : మండల తహసీల్దారు టి ప్రశాంతి శుక్రవారం బాపట్లలో రాష్ట్ర విద్యుత్ శాఖా మాత్యులు గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ వెంకట మురళీల చేతుల మీదగా ప్రశంసాపత్రం అందుకున్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న పావనికుమారి, మేదరమెట్ల ఎస్సై రఫీ

బల్లికురవ : బల్లికురవ మండలం అంబడిపూడి పశువైద్యాధికారి పావనీకుమారిని ఉత్తమ వైద్యురాలిగా జిల్లా అధికారులు గుర్తించారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి రవికుమార్, కలెక్టర్ వెంకటమురళీల చేతుల మీదగా అవార్డు అందుకున్నారు.

పాఠశాలకు కుర్చీల బహూకరణ

పంగులూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెళ్ళపల్లె గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామ పీఏసీఎస్ ఛైర్మన్ మద్దినేని కోటేశ్వరరావు 15వేల విలువ చేసే కుర్చీలను బహూకరించారు. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా కుర్చీలను పాఠశాల ఉపాధ్యాయులకు అందచేశారు.

బ్యాంకు లింకేజీ రుణాలతో కుటుంబాలకు భరోసా



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

చీరాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయంతో కుటుంబాలు ఆనందంగా సాగుతాయని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం మెప్మాలోని పొదుపు సంఘాల మహిళలకు రూ.4.20 కోట్లు చెక్కుల పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు చేయూత అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, కమీషనర్ అబ్దుల్ రషీద్, మెప్మా మేనేజర్ కొండయ్య, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న మహిళలు

అద్దంకి, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సామూహిక వరలక్ష్మీవ్రతం పూజలు వైభవంగా నిర్వహించారు. అద్దంకి పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి మహిళా భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. పూజలకు అవసరమైన పూజా ద్రవ్యాలను దేవస్థానం ఆధ్వర్యంలో సమకూర్చారు. సామూహిక వరలక్ష్మీవ్రతం పూజలకు సుమారు 500 మందికి పైగా భక్తులు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ముందుగా ఈఓ తిమ్మానాయుడు, పూజారులు, మహిళా భక్తులు దేవాలయం ప్రదక్షణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మహిళా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈవో అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, వేదపండితులు హరిశంకరావధాని, పూజారులు తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

● వాయిస్ ఆఫ్ పీపుల్ ప్రతినిధి లంకా భరత్



మొక్కలను నాటుతున్న ఫౌండేషన్ సభ్యులు

పర్చూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వాయిస్ ఆఫ్ పీపుల్స్ ఫౌండేషన్ ప్రతినిధి లంకా భరత్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కడియం నుంచి తెప్పించిన వివిధ రకాల నాలుగు వేల మొక్కలను పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట వాటిని నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక నేతాజీ వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో తులసి శ్రీనివాసరావు, వీరు, సందీప్ తేజ తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ గ్రాండ్ సక్సెస్

● రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ ● 'స్త్రీశక్తి' భాగంగా మహిళలకు ఉచిత బస్సు సేవలు ప్రారంభం

చీరాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టి సూపర్‌సిక్స్ పథకాలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభించిన స్త్రీశక్తి ఉచిత బస్సులను చీరాల డిపోలో ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో ఎంపీ కృష్ణ ప్రసాద్, కలెక్టర్ వెంకటమురళీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని మభ్యపెట్టి వ్యవస్థను సర్వనాశనం చేశాడన్నారు. ఆర్టీసీ వ్యవస్థను సీఎం చంద్రబాబునాయుడు గాడిలో పెడుతున్నాడన్నారు. 13 లక్షల కిలోమీటర్లు తిరిగిన సర్వీసులను నిలిపి వేసినట్లు వివరించారు. మరోవైపు మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణసేవలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్యలు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు శుక్రవారం వేడుకలు జరుపుకుంటే పులివెందుల ప్రజలు ఒకరోజు ముందు అక్కడ విడుదలైన ఫలితాల ఆధారంగా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, కమీషనర్ అబ్దుల్ రషీద్, డిపో మేనేజర్ శ్యామల పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. హ్యాండ్‌లూప్ ఛైర్మన్ సజ్జా హేమలత

మార్టూరు : స్త్రీశక్తి పథకానికి కూటమి ప్రభుత్వం శుక్రవారం శ్రీకారం చుట్టడంతో మండలంలోని టీడీపీ, జనసేన బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మార్టూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ముఖ్య మంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అదేవిధంగా ఆర్‌టీసీ బస్సు వద్ద జండాను ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో షేక్ రజాక్, తాటి నాగేశ్వరరావు, కామినేని జనార్ధన్, కాకోలు వెంకటేశ్వర్లు, తొండెపు ఆదినారాయణ, కమ్మ శివనాగేశ్వరరావు, గుర్రం శ్రీను, జంపని శ్రీను, గొట్టిపాటి వెంకట్రావు పాల్గొన్నారు.



పర్చూరులో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కూటమి నేతలు

పర్చూరు : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం తలపెట్టిన సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని శుక్రవారం పర్చూరులో ఆర్‌టీసీ బస్టాండ్‌లో ప్రజా కూటమి నేతలు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల, పట్టణ అధ్యక్షులు షేక్.షంషుద్దీన్, ఆకుల శ్రీనివాసరావు, నాయకులు కొల్లా శివరాంప్రసాద్, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ దాసరి ఉషారాణి, దాసి సుధారాణి, ఎంపీటీసీ పుల్లెల పద్మా, అడ్డగడ్డ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత బస్సు సేవను ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్

ఇంకొల్లు : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పర్చూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు అన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మహిళలకు స్త్రీశక్తి పథకంలో ఉచిత బస్సును ఇంకొల్లు బస్టాండు ఆవరణలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. మహిళల సాధికా రతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ అధికారి ఎం.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, పాలేరు రామకృష్ణ, కరి శ్రీనివాసరావు, వలేరు మార్క్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి : మహిళాశక్తి పథకం ద్వారా మహిళలు రాష్ట్రం మొత్తం ఐదు రకాల ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చని అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పద్మావతి అన్నారు. అద్దంకి బస్టాండ్‌లో శుక్రవారం సాయంత్రం మహిళాశక్తి పథకాన్ని ఏఎంసీ ఛైర్మన్ పద్మావతి, డీఎం రామ్మోహనరావులు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం మహబూబి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ నాగినేని రామకృష్ణ, కౌన్సిలర్ లు మాగులూరి తిరుపతమ్మ, కంపా రజనీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, లహరి తదితరులు పాల్గొన్నారు.